## గొడుగు గొప్పదనం

ఆయుర్వేదాచార్యులు శ్రీ సుశ్రుతాచార్యులు గొడుగును ధరించడం వలన కలిగే లాభాలను ఇలా వివరించారు.

వర్షానిలరజోఘర్మ-
హిమాదీనాం నివారణం!
వర్ణ్యం చక్షుష్య యోజస్యం
శంకరం ఛత్రధారణమ్!

(సుశ్రుత సంహిత)

గొడుగు- వాన, పెనుగాలి, దుమ్ము ఎండ, మంచు మొదలగు వాటి నుండి మనిషిని కాపాడుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. కండ్లకు మేలు చేస్తుంది. ఓజస్సును పెంచుతుంది. సుఖాన్నిస్తుంది. ఇంత మేలు చేసే గొడుగును ధరించడం అనాగరీకంగా భావించి అలక్ష్యం చేసి అనారోగ్యాన్ని ఆహ్వానించడం ఆచరణీయం కాదు కదా!

ఆయుర్వేద శిరోమణి
రాజరాజేశ్వరశర్మ,

# ఆత్మహత్య

-యం.యస్.మణి



రాత్రి! క్లబ్‌లో గడియారం 'పది' సూచిస్తోంది.

"త్వరగా ఇంటికి రండి!" మూడు రోజుల్నించి సుధీర చెప్తోంది.

పెళ్ళయిన కొత్తలో అతను ఆఫీసు నుంచి త్వరగా ఇంటికి వచ్చేవాడు. సాయంత్రం ఇద్దరూ కలిసి సినిమాకో, మార్కెట్‌కో, స్నేహితుల ఇళ్ళకో వెళ్ళేవారు.

ఇప్పుడు సుధీర జాబ్ చేస్తోంది. ఇద్దరు పిల్లలు. వంట, హెరి హోమ్ వర్క్ పనులతో సుధీరకి రోజూ సాయంత్రం బయట తిరగడానికి వెళ్ళడం ఇష్టం వుండదు. ఆనంద్ ఆఫీసు నుంచి వచ్చాక స్నేహితుల ఇళ్ళకో, క్లబ్‌కో వెళ్ళి వస్తాడు. అతడిని ఎక్కడికీ వెళ్ళొద్దు అనలేదు సుధీర. ఇంటికి త్వరగా రమ్మంటుంది.

"అట్లాగే" అంటాడు నవ్వుతూ. ఆలశ్యంగా వస్తాడు. సుధీరకి కోపం పెరిగిపోతోంది.

"మీరు త్వరగా రాకపోతే ఆత్మహత్య చేసుకుంటాను" అంది మొన్న పొద్దున్న. నిన్నరాత్రి కూడా ఆలశ్యంగానే వచ్చాడు. వెంటనే తలుపు తియ్యలేదు సుధీర. అతడికి భయం వేసింది. నిజంగా ఆత్మహత్య చేసుకోలేదు కదా! అనుకున్నాడు. తలుపు తీశాక మాత్రం సుధీర ప్రవర్తన మామూలుగానే వుంది. ఉత్సాహం లేదు అంతే.

"ఉత్సాహం ఎక్కడ వుంటోంది! ఈ మధ్య! హు. ఆత్మహత్య! అంత తేలికా? సాయంత్రం ఇంట్లో వుండాలంటే బోరు ... పిల్లల చదువు ... ఆడవాళ్ళే చూసుకోవాలి" అనుకున్నాడు.



ఇవేళ సాయంత్రం కాఫీ తాగి బయటికి వెడుతుంటే -

"త్వరగా రండి ... లేకపోతే..." అని ఆగిపోయింది సుధీర.

"ఏం చేస్తావ్!" అన్నట్లు ఒక నిర్లక్ష్యపు చూపు విసిరి వచ్చేశాడు క్లబ్‌కి. ఇప్పుడు పది దాటిపోయింది. ఇంటికి బయలుదేరాడు.

ఇంటి మెట్లు ఎక్కుతుంటే అతడికి అకస్మాత్తుగా భయం వేసింది. గుండె దడదడా కొట్టుకుంది.

"ఏనా నాకు బుద్ధి లేదు. ఇట్లాగ కబుర్లతో కాలక్షేపం చెయ్యకపోతే త్వరగా ఇంటికి వచ్చెయ్యకూడదూ! పిల్లలు పెద్ద వాళ్ళవుతున్నారు. వాళ్ళతో గడపడం అలవాటు చేసుకోవాలి" అనుకున్నాడు. నిశ్చయానికి వచ్చినట్లు,

కాలింగ్ బెల్ నొక్కాడు. ఒకటి ... రెండు నిమిషాలు గడిచాయి. తలుపు తెరుచుకోలేదు.

మళ్ళీ నొక్కాడు. గుండె వేగం హెచ్చుతోంది ... ఇంకొక పక్క "ఆ ... ఏం ఫర్వాలేదు. ఏం చేస్తుందిలే" అని మనసు సర్దుబాటు చేస్తోంది. తలుపు ఇంకా తెరుచుకోలేదు.

తలుపు విరగ్గొట్టాలేమో! మళ్ళీ కాలింగ్ బెల్ నొక్కబోతున్నాడు.

తలుపు తెరుచుకుంది.

నిర్ఘాంతపోయాడు.

సుధీర నవ్వుతోంది. గెలిచిన నవ్వు.

తెలుపు ప్రింటెడ్ చీర కట్టు ... బొట్టు మామూలుగానే వున్నాయి కానీ భుజాల దాకా కత్తిరించిన జుట్టు ఎగురుతోంది.

మొహంలో ఇదివరకు ఎప్పుడూ చూడని క్రూరత్వం!

సుధీర అంటే తను ప్రేమించి వెంటపడి పెళ్ళిచేసుకున్న పొడుగు జడ అమ్మాయి. ఒక అడుగులో లోపలికి దూకి

"ఏం పని చేశావు సుధీరా!" అన్నాడు తల మీద చేయివేసి. ఆ చేతిని తోసేసి, "ఆత్మహత్య చేసుకున్నాను.. ఇంక మీకు నేను లేను. ఎప్పుడైనా రండి. ఏమైనా చెయ్యండి. మిమ్మల్ని నేను అడగను. శాపించను. మీ ఇష్టం మీది ... నా ఇష్టం నాది" అని లోపలికి వెళ్ళిపోయింది.

*

1940 లో విశాఖలో జరుగుతున్న మేధావుల సభలో కట్టమంచివారు ప్రసంగించారు. ఆ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఆక్సుఫర్డు విద్యార్థి అయిన తన ప్రతి కక్షిని దృష్టిలో వుంచుకుని "ఆక్సుఫర్డులో చదువుకున్న వాడు ప్రపంచం అంతా తనదే అనుకుంటాడు. అయితే కేంబ్రిడ్జి విద్యార్థి ఆ ప్రపంచాన్నే ఖాతరు చెయ్యడు" అన్నారట. డాక్టర్ రెడ్డి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ విద్యార్థి అని మనం గుర్తించాలి.

— వేమకోట ఉమా
మహేశ్వరరావు